క్లుప్తంగా

భూసార పరీక్షలు నిర్వహించాలి

తిరువూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతు భరోసా కేంద్రాల పరిధిలో భూసార పరీక్షలు నిర్వహించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందికి శుక్రవారం భూసార పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌కు 600, రబీ సీజన్‌కు 250 మట్టి నమూనాలను సేకరించాలన్నారు. రైతులకు భూసార పరీక్షల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం తదితర అంశాలపై రైతులకు సూచనలిస్తామని, తద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గుతాయని చెప్పారు.

బస్‌పాస్ కౌంటర్ల ఏర్పాటు

తిరువూరు: నూతన విద్యా సంవత్సరంలో ఆర్టీసీ ఉచిత బస్‌పాసులు, కన్సెషన్ పాసులను విద్యార్థులకు అందజేసేందుకు తిరువూరు, మైలవరం బస్టాండులలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని తిరువూరు డిపో మేనేజర్ టి. వేణు తెలిపారు. అన్ని తరగతుల విద్యార్థులకూ ఈ కౌంటర్లలో పనిదినాలలో బస్‌పాసులు ఇస్తారని, సంబంధిత విద్యా సంస్థల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తప్పక తీసుకు రావాలని సూచించారు.

క్షీరబంధు చెక్కు అందజేత



రెడ్డిగూడెం: కృష్ణా మిల్క్ యూనియన్‌కు పాలు పోసి యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ సభ్యురాలు ఎం. విజయలక్ష్మి అన్నారు. అలివేలు మంగాపురం పాల సంఘ సభ్యులు బొమ్మిన ధనలక్ష్మి ఇటీవల మృతిచెందారు. క్షీరబంధు పథకం కింద రూ. 50 వేల చెక్‌ను మృతురాలి భర్త బొమ్మిన సత్యనారాయణకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యురాలు ఎం. విజయలక్ష్మి, టి సాంబశివమూర్తి, బొమ్మిన వైదేహీ తదితరులు పాల్గొన్నారు.

నేడు నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: పట్టణ పురపాలక సంఘం పాలక వర్గ సమావేశం శనివారం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

పార్కును అభివృద్ధి చేయండి



పటమట(విజయవాడతూర్పు): పటమట 10వ డివిజన్‌లోని అక్కినేని పూర్ణచంద్రరావు పార్కును అభివృద్ధి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మారుతి కోఆపరేటివ్ ఎంప్లాయిస్ కాలనీ పార్కును సందర్శించి అధికారులను పలు సూచనలు చేశారు. పార్క్ లో వాకింగ్‌కు అనుకూలంగా ట్రాక్ ఏర్పాట్లు చేయాలని, ప్రజలందరికీ ఆరోగ్యానికి తోడ్పడేందుకు ఓపెన్ జిమ్, చిన్నారులకు ప్లే పరికరాల ఏర్పాటు, ఆరోగ్యమైన గ్రీనరీ పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పార్క్ వెనుక భాగంలోని మెడిటేషన్ హాలును వీఎంసీ అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన పంట కాలవ రోడ్డు పక్కన గల పార్క్ లో కూడా ప్లే ఐటమ్స్, అందమైన పెయింటింగ్స్ వేసి అభివృద్ధి పరచాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన పంట కాలవ నుంచి వెళ్లే హైటెన్షన్ లైన్ (హెచ్‌టి) లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండటానికి బీటీ రోడ్డు వేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర రావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, తిలక్, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కేంద్రప్రభుత్వం అందజేసే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని కొత్తూరు తాడేపల్లి ఏపీఎం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు లకావతు శ్రావణి, ఇళ్లా అఖిల, ఇస్లావత్ శ్రీరామ్ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి 9,10,11,12 తరగతులు చదువు కునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ. 12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తోందన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

పర్యావరణానికి పెనుముప్పు

- యథేచ్ఛగా పాలిథిన్ క్యారీబాగుల వినియోగం
- అమలు కాని నిషేధాజ్ఞలు
- భూమి పొరల్లో, నీటిలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- ఆరోగ్యానికి హానికరం



డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వాటిని తొలగిస్తే వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు

నూజివీడు: పర్యావరణానికి ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్ల నుంచి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. నూజివీడు పట్టణంలో పాలిథిన్ కవర్ల వాడకం యథేచ్ఛగా కొనసాగుతోంది. వీటి అమ్మకాలను అడ్డుకునే నాథుడు కరువవడంతో వాతావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా హాని కలుగుతోంది. ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం గతంలోనే 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన కవర్లు వాడకూడదని నిషేధం విధించింది. ఈ నిషేధాన్ని అమలు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు భూమిలో కలిసిపోవాలంటే కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని ఒకవైపు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గుర్తొచ్చినప్పుడు వ్యాపారులతో మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించడం, అప్పుడప్పుడు తాము ఉన్నామని గుర్తు తెచ్చేందుకు దాడులు చేయడం తప్పితే దుకాణాల్లో విక్రయాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీంతో పాలిథిన్ కవర్లు, ఇతర వస్తువుల వాడకం యథావిధిగా కొనసాగుతోంది. ముఖ్యంగా హోటళ్లలో కూరలు, సాంబారు వంటి వేడి పదార్థాలను ప్లాస్టిక్ సంచుల్లో కట్టి ఇస్తున్నారు. దీనివల్ల వేడికి ప్లాస్టిక్ సంచులలోని ప్రమాదకర రసాయన కారకాలు కూరల్లో కలిసి తరువాత వాటిని తిన్న మనుషుల శరీరంలోకి చేరుతున్నాయి. పాలిథిన్, ప్లాస్టిక్ కరిగి మన శరీరంలో చేరి క్యాన్సర్‌కు దారి తీస్తోందని వైద్యులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వివాహాలు, తదితర శుభకార్యక్రమాల్లో వాడి పారేస్తున్న ప్లాస్టిక్ గ్లాసులు, టేబుళ్లపై వేస్తున్న ప్లాస్టిక్ పేపర్ తదితరాలు భూమి పై పొరల్లో పేరుకుపోయి వందలాది సంవత్సరాలు కాలుష్య కారకాలుగా ఉంటున్నాయి. నీరు భూమి పొరల్లో ఇంకకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడుతున్నాయి. పట్టణంలోని డ్రెయినేజీల నిండా ప్లాస్టిక్ గ్లాసులు, పాలిథిన్ కవర్లు ఉంటుండటంతో మురుగునీరు, వరదనీరు ప్రవహించడానికి వీలు లేక రోడ్లపైకి రావడమో, డ్రెయినేజీల్లో రోజుల తరబడి నిల్వ ఉండటమో జరుగుతోంది. పాలిథిన్ క్యారీ బ్యాగ్‌లను విక్రయించే వారిపై దాడులు చేసి అపరాధ రుసుం విధించేలా నిబంధనలున్నా సంబంధిత అధికారులెవ్వరూ అమలు చేయడం లేదు. ఇప్పటికైనా నిషేధాజ్ఞలను పటిష్టవంతంగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.



విచ్చలవిడిగా వాడుతున్న పాలిథిన్ కవర్లు

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ శౌరిబాల



దాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో శుక్రవారం రైల్వే హాస్పటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉంటే ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. చాలామందిలో రక్తదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. ఒక వ్యక్తి రక్తదానం చేస్తే తిరిగి అతని శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయని చెప్పారు. రక్తదానం విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాజానికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 86 మంది హాస్పటల్ సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరువూరు: మండలంలో 11 కేవీ ప్రధాన విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జగదీష్ తెలిపారు. సత్యాలపాడు, ఆర్లపాడు, రాజులపాలెం, జింకలపాలెం, మేడూరు, గుళ్లపూడి, సాబ్బాల, లింగాల, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

- **భవానీపురం(విజయవాడపశ్చిమ):** గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పుష్కరఘాట్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయిరాం అపార్ట్‌మెంట్ ఏరియా, సాయికృష్ణ అపార్ట్‌మెంట్ ఏరియా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని చెప్పారు.

రేపు మెగా నేత్ర వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ (ఏపీటీడీసీ) పక్షాన భవానీపురంలోని భవానీ ద్వీపంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉచిత అధునాతన మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని అయాన్ ఐ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ బీఆర్‌పీ రోడ్‌లోని అయాన్ ఐ హాస్పటల్ చీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ మయాఖ్ నేతృత్వంలో అనుభవజ్ఞులైన కంటి చూపు పరీక్ష నిపుణులు, సాంకేతిక సహాయకులు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కంటికి సంబంధించిన అన్ని సమస్యలను అధునాతన వైద్య యంత్ర పరికరాల ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి మందులు, డ్రాప్స్ అందచేస్తారని పేర్కొన్నారు.
శస్త్ర చికిత్సలు, కళ్ల జోళ్లు అవసరమైన రోగులకు అయాన్ ఐ హాస్పటల్‌లో విశేష రాయితీలు ఇస్తారని చెప్పారు. పర్యాటక శాఖకు చెందిన ఏపీటీడీసీ, బీఐటీసీ (భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్) ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు, భవానీ ద్వీపం సందర్శనార్థం వచ్చే పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీటీఈలపై దాడులకు నిరసన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విధుల్లో ఉన్న టీటీఈలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ టిక్కెట్ చెక్కింగ్ బ్రాంచ్, మజ్దూర్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. దాడులను నిరసిస్తూ రైల్వేస్టేషన్ వద్ద ప్రదర్శించి సీనియర్ డీసీఎంకు వినతిపత్రం సమర్పించారు. సంఘ్ కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 10న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరు టీటీఈలపై కొంతమంది దాడి చేసి రూ. 70 వేల నగదు, వారి వంటిపైన ఉన్న ఆభరణాలు, డ్యూటీ పుస్తకాలను దోచుకున్న ఘటనను తీవ్రంగా ఖండించారు. విధుల్లో ఉన్న టీటీఈలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ కల్పించాలని సీనియర్ డీసీఎంను కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ కార్యదర్శి బాలాజీ, యూనియన్ చైర్మన్ డి.వి. వర్మ, సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నాలుగు నెలల వేతనాలు తక్షణమే కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు ఆలస్యం కావడంతో ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకులు, బియ్యం తదితరాలు కొనలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు ముగిసిప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈఓ కేఎస్.రామరావు ఘాట్‌రోడ్డులోని దేవస్థాన బస్సుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన ఈఓ భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మరో వైపున మహా నివేదన నిమిత్తం మధ్యాహ్నం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్జిత సేవలకు రద్దీ

అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు ఇతర ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అమ్మవారిని శుక్రవారం పలువురు మంత్రులు దర్శించుకున్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, ఎస్. సవితలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.



దేవస్థానం బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న ఈఓ రామరావు

బస్సుల్లో ఈవో తనిఖీలు...

దేవస్థానం నడిపే బస్సుల్లో ఆలయ ఈఓ కేఎస్ రామరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తొలుత ఓం టర్నింగ్‌లోని దేవస్థానం బస్సులు నిలిపే పాయింట్‌కు చేరుకున్న ఈఓ బస్సులు ఏయే సమయాలకు వస్తున్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం బస్సులో ప్రయాణించి దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. బస్సులో ప్రయాణించే సమయంలో ఆలయంలో అమ్మవారి దర్శనంలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయంలోని ఇంజినీరింగ్, ఇతర విభాగాలలో అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించినట్లు ఈఓ రామరావు పేర్కొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపు

కల్నల్ బలందర్ సింగ్

మైలవరం: ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, నిబద్ధత, మంచి నడవడిక అలవడతాయని, ప్రతి ఒక్క విద్యార్థి ఎన్‌సీసీలో చేరాలని కల్నల్ బలందర్ సింగ్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ సీనియర్ విభాగం, జూనియర్ విభాగం క్యాడెట్లకు శుక్రవారం నుంచి పది రోజుల పాటు ఏటీసీ క్యాంప్ ఏర్పాటు చేశారు. క్యాంప్‌నకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కల్నల్ బలందర్ సింగ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగం ద్వారా రక్షణ దళంలో, దేశ సరిహద్దులలో పురుషులతో పాటు మహిళలకు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పది రోజులు జరగనున్న ఈ శిబిరంలో సెల్ఫ్ లెర్నింగ్, రైఫిల్ షూటింగ్, డ్రిల్, వివిధ అంశాలలో శిక్షణ ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎన్‌సీసీ పీఐ స్టాఫ్ గరల్స్ క్యాడెట్స్ ఇన్‌స్ట్రక్టర్ మహీందర్ మేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్నల్ బలందర్ సింగ్

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



రామలింగేశ్వర స్వామి వారికి విశేష అలంకరణ



స్వామి వారి శాంతి కల్యాణోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, అఖండ దీపారాధన, అంకురారోపణ, ప్రధాన కలశస్థాపన జరిగాయి. అనంతరం ప్రధాన దేవతా మూర్తులకు అనుష్ఠానం నిర్వహించారు. తొలుత ఆలయంలోని దేవతా మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించగా, రామలింగేశ్వర స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఆగమ ప్రతిష్ఠాచార్య అవ్వారి ఉమాశంకర దీక్షిత శర్మ పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపకులు, ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. పూజా తమ్మిన సతీష్, వాణి దంపతులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని వేదికపై శ్రీ శారదా నృత్య కళాపీఠానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది.

టిక్కెట్ బుకింగ్ కౌంటర్ ఎత్తివేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో సరుకు, ప్రయాణికుల రవాణాలో ఎంతో ఆదరణ కలిగిన హనుమాన్‌జంక్షన్‌లోని నూజివీడు రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను శుక్రవారం నుంచి నిలిపివేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద అకస్మాత్తుగా నోటీసు బోర్డు ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రయాణికుల సంఖ్య, టిక్కెట్ల విక్రయాల పరంగా రాబడి ఉన్నప్పటికీ టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను మూసివేయడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. రైల్వేస్టేషన్లలో టిక్కెట్ బుకింగ్‌ను పూర్తిగా ప్రైవేట్‌పరం చేసే యోచనలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంతాల్లోని సుమారు 40 గ్రామాలకు నూజివీడు రైల్వేస్టేషన్ ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. జన్మభూమి, రత్నాచల్, సింహాద్రి, తిరుమల వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు రాజమండ్రి-విజయవాడ, కాకినాడ-విజయవాడ ప్యాసింజర్ రైళ్లకు ఇక్కడ హాల్ట్ ఉంది. ఈ రైల్వేస్టేషన్ నుంచి రోజుకు సగటున 600-700 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, నెలకు సరాసరి రూ. 45 లక్షల విలువ చేసే టిక్కెట్లను విక్రయిస్తున్నట్లుగా రైల్వే అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కానీ ఈ గణాంకాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దక్షిణ మధ్య రైల్వే అర్థాంతరంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను నిలిపివేసింది. దీని స్థానంలో రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద ప్రైవేట్ వ్యక్తులకు కమిషన్ పద్ధతిపై కేవలం జనరల్ టిక్కెట్లు విక్రయించేందుకు ఏర్పాటు చేశారు. ముందస్తుగా ప్రయాణాలకు రైల్వే టిక్కెట్లను రిజర్వేషన్ చేసుకునేందుకు కానీ, తత్కాల్ టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీని వల్ల హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంత ప్రజలు రైల్వే టిక్కెట్ రిజర్వేషన్, తత్కాల్ టిక్కెట్ల కోసం ఏలూరు, గుడివాడ, విజయవాడ రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైల్వే అధికారుల తీరుపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి నూజివీడు రైల్వే స్టేషన్‌లో యథాతథంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, రిజర్వేషన్, తత్కాల్ టిక్కెట్లను విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేఆర్ సూర్యనారాయణపై చర్యలు తీసుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా పని చేస్తూ, ఆ సంఘ నేతగా చెలమణి అవుతున్న కేఆర్ సూర్యనారాయణపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ విజయవాడ సిటీ మూడో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఆర్‌ఎస్ గణేష్, ఎ.రవి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం మారినప్పుడల్లా సూర్యనారాయణ ఆ ప్రభుత్వం తన వల్లే వచ్చిందంటూ పాలకులతో ఫొటోలు దిగి అధికారులను బెదిరింపులకు దిగే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయాల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన అభియోగంపై శాఖాపరమైన నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం సూర్యనారాయణపై సస్పెన్షన్ వేటు వేసిందన్నారు. అలాగే అతనికి సహకరించిన ఉద్యోగులను కూడా సస్పెండ్ చేసిందని, వారంతా జైలుపాలయ్యారని పేర్కొన్నారు. అయితే సూర్యనారాయణ మాత్రం అజ్ఞాతంలోకి వెళ్లి అరెస్ట్ కాకుండా స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. సూర్యనారాయణ సంఘానికి ఆన్ డ్యూటీ (ఓడీ) సౌకర్యం లేకపోయినా ఇతర సంఘాలకు ఉన్న సౌకర్యాలను చట్టవిరుద్ధంగా పొందాడని తెలిపారు. 2023లో సూర్యనారాయణ సంఘ సభ్యుల అక్రమాలపై నగరంలోని వర్తకులు తమను వేధిస్తున్న విధానాలపై ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. సూర్యనారాయణపై ఉన్న కేసులను పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, సంఘం గుర్తింపును రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆ ప్రకటనలో వన్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కె.రాములు, నరేంద్ర, టు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీధర్, ఎం.విజయకాంత్ సంతకాలు చేశారు.

మధ్యాహ్న భోజనంలో మార్పు తీసుకురావాలి

మైలవరం: మధ్యాహ్న భోజనంలో మార్పులు తీసుకురావాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో మైలవరం మండల శాఖ అత్యవసర సమావేశం శుక్రవారం జరిగింది. పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు పి. గోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను మాతృ పాఠశాలలో విలీనం చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఆత్మ స్థైర్యాన్ని కాపాడాలని, పాఠశాలల సమయాన్ని 9.45 నుంచి 4.45కు మార్చాలని తీర్మానించారు. తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చే విధంగా ఉండాలని కోరారు. అందరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన మంత్రివర్గాన్ని అభినందించారు. సమావేశంలో పీఆర్‌టీయూ సభ్యులు పుల్లారెడి సతీష్, సూరిబాబు, గోపాల్, శేషగిరిరావు, నాగలత పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉన్నదాంట్లోనే తోటి వారికి సహాయం చేయాలని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని పార్టీ డివిజన్ కార్యాలయంలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సయ్యద్ ఇమ్రాన్‌కు రూ.15 వేల నగదును ఆర్థిక సహాయంగా జయప్రకాష్ శుక్రవారం అందచేశారు. ఆర్థికంగా వెనుకబడిన పిల్లల చదువుకు తమ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. గోగం బాలకోటయ్య, కనగాల రాజశేఖర్, శివ రామకృష్ణ పాల్గొన్నారు.